క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయానికి విద్యుత్ దీపాల అలంకరణ

పాలసముద్రం: నేటి నుంచి ఆముదాల పుత్తూరులో వెలసిన కోదండరామ స్వామికి నవమి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ధర్మకర్త జూగర్లముడి శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో తల్లిదండ్రులను కోల్పోయిన కుటుంబానికి మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోహన్ మురళీ రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. చవటగుంట గ్రామానికి చెందిన దాంట్ల సుబ్రమణ్యంరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సుబ్రమణ్యంరెడ్డి భార్య కాంతమ్మ కూడా 15 రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండువారాల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు ఉమాశంకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి అనాథలుగా మిగిలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి ఆర్థిక సాయం చేసి ధైర్యం చెప్పారు.

మరుభూమి కష్టాలు



కాలువలో నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ చెరుముందర కండ్రిగ గ్రామానికి శ్మశాన వాటిక లేదు. ప్రస్తుతం గ్రామాల్లో మృతి చెందిన వారిని చెరువు కాలువ పక్కన పూడ్చి పెడుతున్నారు. కాలువలో నీరు ఎక్కువైపోతే పూడ్చిన శవాలు నీటిలో కొట్టుకుని చెరువులోకి పోతున్నాయి. అధికారులు స్పందించి చెరుముందర కండ్రిగకు శ్మశాన వాటిక ఏర్పాటు చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికార నందిపై కరకంఠేశ్వరుడు



నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కళ్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కరకంఠేశ్వర స్వామిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అభిషేక అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మ కర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భానుడు భగభగ



- నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బ ముప్పు
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన
- సొంత వైద్యం ప్రాణానికి ముప్పు



వడదెబ్బపై అవగాహన ఇస్తున్న డాక్టర్ విష్ణుప్రియ (ఫైల్)

విజయపురం: ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. అప్పుడప్పుడు మబ్బు కనిపించి వెళ్లినా ఎండ తీవ్రత మాత్రం తగ్గలేదు. ఎండాకాలంలో ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ సోకే ప్రమాదముందని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా వైద్యుల సూచన పాటించాలి. ప్రస్తుతం జిల్లాలో 40–42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. ఇటీవల నింగ్ర 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం విశేషం. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్, (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా (విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు ఎండ నుంచి రక్షణ పొందడానికి గొడుగు లేదా టోపీ లేదా తలపై వస్త్రం వేసుకోవాలని సూచించారు. తగినంత నీరు, చల్లని పానీయాలు తీసుకుంటూ ఉండాలన్నారు. శరీరాన్ని చల్లబరచుకోవడానికి ప్రజలు చెరుకు రసం, కొబ్బరినీళ్లు తదితర పానీయాలతోపాటు కళింగర, దోస, తదితర పండ్ల రసాలు తీసుకోవడం ఉత్తమమైనదని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యవసాయ కూలీల జాగ్రత్త

గ్రామీణ స్థాయిలో ఉన్న వ్యవసాయ రైతులు, కూలీలు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 వరకు మాత్రమే పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒళ్లు నొప్పులు వస్తాయి. అదే విధంగా ఒక్కొక్కసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

వడదెబ్బ లక్షణాలు ఇవే..

- ఎండకూ, వేడికీ బహిర్గతమైతే వడదెబ్బ తగలడం సహజం. అయితే అవి ఎండదెబ్బ లక్షణాలను గుర్తించలేక, పట్టించుకోకుండా వదిలేస్తే, పరిస్థితి తీవ్రంగా పరిణమించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ సన్ స్ట్రోక్ లక్షణాలను గమనించుకోవాలి.
- శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలకు చేరుకున్నా, మించినా ఎండదెబ్బ తగిలినట్టు నిర్ధారించుకోవాలి. ఇలా జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి.
- శరీర ఉష్ణోగ్రత పెరగడం వల్ల గుండె కూడా వేగంగా కొట్టుకోవడం మొదలుపెడుతుంది.
- త్వరత్వరగా శ్వాస తీసుకోవడం మొదలుపెడుతుంది.
- శరీరం వేడెక్కినప్పుడు గుండె విపరీతమైన ఒత్తిడికి లోనవుతుంది.
- శరీరాన్ని సహజసిద్ధంగా చల్లబరిచే ప్రక్రియతో, ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేయడం కోసం గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెడుతుంది. ఫలితంగా ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది.
- ఎండదెబ్బతో మెదడు పనితీరు మీద ప్రభావం పడుతుంది. దాంతో అయోమయం, కళ్లు తిరగడం, కొన్ని సందర్భాల్లో ఫిట్స్ కూడా రావచ్చు.
- ఎండదెబ్బతో నాడీ వ్యవస్థ ప్రభావితమై, సమన్వయం కోల్పోతాం. దిక్కుతోచని స్థితికి లోనవుతాం.
- కోపం, నడవలేకపోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.
- తలనొప్పి, తలతిరుగుడు కూడా ఉంటుంది. డీహైడ్రేషన్ వల్ల, ఎండదెబ్బతో నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల ఇలా జరగవచ్చు.
- శరీరం అవసరానికి మించి వేడెక్కడం మూలంగా వాంతులు మొదలవుతాయి.
- చర్మం పొడి బారి, వేడెక్కుతుంది. శరీరం ఎంత వేడెక్కినా చెమట పట్టదు.
- సహజంగా వేసవిలో వ్యాయామం తర్వాత ఈ లక్షణాలు కనిపిస్తాయి. వీటిని కూడా సన్‌స్ట్రోక్ లక్షణాలుగానే పరిగణించాలి.
- చెమట ద్వారా శరీరంలోని నీళ్లను కోల్పోయేకొద్దీ డీహైడ్రేషన్‌తో మైకం వస్తుంది.

ప్రథమ చికిత్స ఇలా..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి. శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజు, ద్రావణం తాగించాలి. రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

జాగ్రత్తగా ఉండాలి



వేసవిలో ప్రజలు సాధ్యమైనంత వరకూ బయటకు తిరగరాదు. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, తాగడం మంచిది. వృద్ధులు, చిన్నారులు కార్మికులు ఎండ ప్రభావానికి దూరంగా ఉండాలి. శీతల పానీయాలు తాగకూడదు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవడం మంచిది. అలాగే కాటన్ దుస్తులు ధరించాలి.

–డాక్టర్ విష్ణుప్రియ, విజయపురం.

డంపింగ్ యార్డుకు కంచె ఏర్పాటు

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీలోని డంపింగ్ యార్డుకు స్థానిక సర్పంచ్ గోవిందయ్య కంచె ఏర్పాటు చేశారు. శనివారం జేసీబీతో చదును చేసి శుభ్రం చేశారు. డంపింగ్ యార్డు వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నవమి వేడుకలకు ఏర్పాట్లు



వడమాలపేటలో సంజీవి రామాలయం

వడమాలపేట (విజయపురం): వడమాలపేటలో ప్రతి ఏటా శ్రీరామ నవమి వేడుకలు సంజీవి రామ దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే ఈ నెల 6న శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వడమాలపేట ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పెద్ద వేడుకలకు తరలిరానున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం

కార్వేటినగరం: విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకెళ్లాలని కార్వేటినగరం జామియా మసీద్ కమిటీ అధ్యక్షుడు హమీద్‌ఖాన్ అన్నారు. శనివారం మసీదు ఆవరణంలో 8 నుంచి 16 సంవత్సరాల విద్యార్థులకు ఖిరత్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన చిన్నారులకు పతకాలు అందించారు. చిన్నారుల సామర్థ్యాలను వెలికి తీయడానికి ఖిరత్ పోటీలు దోహద పడతాయన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం





స్టేషన్లకు అందించే బకెట్లు చూపుతున్న డీఎస్పీ, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

నగరి: అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. కార్యాలయ ఆవరణలో అగ్ని ప్రమాదాలను నివారించడంపై శనివారం స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. మంటలు ఎలా అదుపు చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా వచ్చిన రెండు ఫైర్ ఎస్టింగ్విషర్లు, రెండు బకెట్లను ఆయా స్టేషన్ల సిబ్బందికి అందించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని పురస్కరించుకొని ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వేసవి తీవ్రతతో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ ఆస్కారం ఉంటుందని జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లలో వంట పూర్తి చేసిన గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్లను ఆఫ్ చేయాలని తల్లిదండ్రులకు విద్యార్థులు గుర్తు చేస్తూ ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాద నివారణకు చేపట్టే ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు రెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీరాముడు



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

కార్వేటినగరం: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని సీతా,రామ,లక్ష్మణులు కల్పవృక్ష వాహనంపై పుర వీధుల్లో ఊరేగారు.స్వామిని ఆభరణాలతో అలంకరించి రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి సురేష్ కుమార్, వేదపండితులు రమేష్, శభరి, గోపాలాచారి, బాబు సురేష్ పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు సీతా, కోదండరాముల వారికి కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీఎస్పీ

కార్వేటినగరం: కార్వేటినగరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కుబేంద్రన్ అనారోగ్యంతో ఈనెల 1వ తేదీ మృతి చెందారు. వారి కుటుంబాన్ని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ శనివారం పరామర్శించి ప్రభుత్వం తరఫున రూ.20 వేల చెక్కును అందజేశారు. డీఎస్పీ వెంట సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీరంగరాజపురం: కానిస్టేబుల్ ఆనంద్‌బాబు కుటుంబానికి నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆర్థిక సాయం అందించారు. శ్రీరంగరాజపురం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆనంద్ బాబు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐలు సుమన్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

భూతవాహనంపై నీలకంఠుడు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం పంగుణి బ్రహ్మోత్సవాలు భక్తి ప్రపత్తులతో జరిపించారు. మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలతో హారతులు పట్టారు. భక్తులకు దర్శన ప్రాప్తి కల్పించారు. ఉదయం భూతవాహనంపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. రాత్రి శేషవాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామికి కర్పూర హారతులు పట్టి తరించారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పుత్తూరు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మూడేళ్ల కాలపరిమితి కలిగిన కార్యవర్గ ఎన్నికలకు జిల్లా సంఘం నాయకులు చెంగల్రాయులు, చంద్రశేఖర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుప్పయ్య, కోశాధికారిగా రామలింగం, గౌరవ అధ్యక్షుడిగా యుగంధర్‌రాజు, ఉపాధ్యక్షులుగా బాలసుబ్రమణ్యం, హనుమంతరావు, లోకేశ్వరి, మాలినిదేవి, కార్యదర్శులు రామచంద్రరాజు, రమేష్, అరుణాచలంరెడ్డి, వెంకటరమణతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు జయరాంనాయుడు, జిల్లా అధ్యక్షులు శంకర్ సమక్షంలో నూతన సంఘ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

లొట్టలేయాల్సిందే!

- జిల్లాలో పెరిగిన మటన్, నాటుకోడి, రాగిముద్ద వినియోగం
- బర్డ్‌ఫ్లూతో తగ్గిన బ్రాయిలర్ చికెన్ అమ్మకాలు
- సంతలో పొట్టేళ్లను కొనడం గ్రామాల్లో విక్రయించడం
- నాటుకోళ్లకు పెద్దసంత బైరెడ్డిపల్లి
- పెరిగిన మటన్, నాటుకోడి, రాగిముద్ద హోటళ్లు



బైరెడ్డిపల్లి సంతలో నాటుకోళ్ల అమ్మకాలు



మటన్ కర్రీతో రాగిముద్ద

పలమనేరు: ఆదివారం వచ్చిందంటేచాలు నాన్‌వెజ్ ఘుమఘుమలాడాల్సిందే. నాటుకోడి, మటన్, రాగిముద్ద చూసి లొట్టలేయాల్సిందే. గత కొన్నాళ్లుగా బ్రాయిలర్ కోళ్లకు రోగాలంటూ చాలామంది వాటి జోలికెళ్లడం లేదు. దీంతో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్, నాటుకోడికి ప్రాధాన్యత పెరిగింది. మటన్ చారు, నాటుకోడి పులుసు కాంబినేషన్‌గా రాగిముద్ద ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. కోవిడ్ నేర్పిన పాఠంతో ప్రజలు ఆరోగ్యంపై దృష్టిని సారించారు. వ్యాధినిరోధకశక్తిని పెంచుకునేందుకు మాంసాహారంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. రాయలసీమ సంప్రదాయవంటకమైన రాగిముద్దకు నాటుకోడి పులుసు, మటన్ మంచి కాంబినేషన్ కావడంతో లొట్టలేసుకొని రెండు ముద్దలు ఇట్టే లాగించేయొచ్చు. జిల్లాలో మటన్ ధర రూ.850, నాటుకోడి రూ.400 దాటినా జనం కొనేందుకు వెనక్కి తగ్గడం లేదు.

భారీగా మటన్ అమ్మకాలు...

జిల్లాలో రెండు వేల దాకా మటన్ దుకాణాలున్నాయి. దీనికితోడు పల్లెల్లో కొందరు పొటేళ్లు, మేకలను కొని ఆదివారం వాటిని భాగాలుగా వేసి విక్రయాలు సాగిస్తున్నారు. గతంలో కంటే ఈ ఆరు నెలల్లో మటన్ విక్రయాలు రెట్టింపైనట్టు వ్యాపారులు చెబుతున్నారు. మొన్నటి దాకా కిలో మటన్ రూ.600గా ఉండగా ఇప్పుడు రూ.850 దాటింది.

భారీగా వెలిసిన హోటళ్లు..

ఈమధ్య కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కర్ణాటకలోని కోలారు, బెంగళూరుల్లోనూ మటన్, నాటుకోడి చారు, రాగిముద్ద ప్రత్యేక హోటళ్లు, దాబాలు వందలాదిగా వెలిశాయి. ఇక ఆదివారం పూట ఇంటివంట పేరిట ఇళ్లల్లోనే మటన్, నాటుకోడి పులుసు చేసి తోపుడు బండ్లపై, హైవేల్లో సంచార వాహనాల్లోనూ అమ్మకాలు జోరందుకున్నాయి.

నాటుకోడిపై పెరిగిన మోజు



నాటుకోడి పులుసు, రాగిముద్ద

గతంలో పల్లెల్లో ప్రతి ఇంట్లో పెరటి నాటుకోళ్లు కచ్చితంగా ఉండేవి. బంధువులు ఇంటికొచ్చినా, పండుగలొచ్చినా కోడికూర వండేవారు. జీవనశైలిలో వచ్చిన మార్పుతో పెరటికోళ్ల పెంపకం తగ్గింది. బ్రాయిలర్ కోళ్ల వినియోగం పెరిగింది. అయితే మళ్లీ జనం నాటుకోళ్లవైపు ఆసక్తిని పెంచుకున్నారు. దీంతో నాటుకోళ్ల పెంపకం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో వందకుపైగా నాటుకోళ్ల పౌల్ట్రీలున్నాయి. సాఫ్ట్‌వేర్‌లు సైతం నాటుకోళ్ల పెంపకం మొదలుపెట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు గతంలో రోజుకు 30 టన్నులుగా ఉండేవి. కానీ ఇప్పుడు 15 టన్నులకు తగ్గింది. నాటుకోళ్ల అమ్మకాలు 4 టన్నులుగా ఉండేది. ఇప్పుడు 8 టన్నులకు చేరింది. ఇక మటన్ విక్రయాలు సైతం 10 టన్నులకు చేరడం గమనార్హం.

నాటుకోళ్లు, పుంజుల కోసం మూడు రాష్ట్రాల నుంచి...



పలమనేరులో మేలుజాతికి చెందిన పొట్టేలు



కోడి పుంజు

పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లిలో ప్రతి శనివారం జరిగే నాటుకోళ్లు, పుంజుల సంతకు ఏపీ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వందలాది మంది వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ లక్షల్లో నాటుకోళ్ల వ్యాపారం జరుగుతుంది.

బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

వడమాలపేట (విజయపురం): భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వడమాలపేట మండలంలో పలువురు ఆయనకు ఘన నివాళి అర్పించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం పోరాడారని అంబేడ్కర్ సంఘం నాయకులు తెలిపారు. వారి హక్కుల కోసం ఆయన జీవితాంతం సాగించిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో జయంతిబాబు, మునిబాబు, డాక్టర్ నాగరాజు, మస్తాన్, దేవరాయలు, వెంకటస్వామి, రాజశేఖర్ గురవయ్య, సుబ్రమణ్యం, కల్యాణ్, సాయి ప్రకాష్, ఉమాపతి పాల్గొన్నారు.